



పరీక్ష కేంద్రాలను పరిశీలిస్తున్న డీఐఈవో

ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం

నిజామాబాద్‌అర్బన్, ఫిబ్రవరి 1: ఇంటర్‌మీడియట్ జనరల్, ఒకేషనల్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా మూడు విడతల్లో పరీక్షలను నిర్వహిస్తున్నారు. తొలిరోజు ఉదయం జనరల్ విద్యార్థులు మొత్తం 1045మంది హాజరుకావాల్సి ఉండగా 1002మంది హాజరు కాగ 43మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ 1489మంది హాజరుకావల్సి ఉండగా 1193మంది హాజరుకాగా 296మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 689మంది జనరల్ విద్యార్థులకు గాను 664హాజరు కాగ 25మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ 1372మందికి గాను 1170మంది హాజరుకాగ 202మంది గైర్హాజరయ్యారు. జిల్లాలో డీఐఈవో రఘురాజ్ ఐదు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేయగా పరీక్ష నిర్వాహణ కమిటీ సభ్యులు, ఫ్లైయింగ్‌స్క్వాడ్ బృందం 15పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ

అడ్మిషన్ల గడువు పొడిగింపు

నిజామాబాద్‌అర్బన్, ఫిబ్రవరి 1: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో 2023-24 విద్యా సంవత్సరానికి గాను డిగ్రీ, పీజీ అడ్మిషన్ల గడువును ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఫిబ్రవరి16 వరకు పొడిగించినట్లు అధ్యాయన కేంద్ర రీజినల్ కోఆర్డీనేటర్ రంజిత ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీలో బీఏ, బీకాం, బీఎస్సీ, పీజీలో ఎంఏ ఎకనామిక్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ, జర్నలిజం మాస్ కమ్యూనికేషన్, ఇంగ్లిష్, తెలుగు, ఉర్దు, హిందీ, ఎంకాం, ఎంఎస్సీ, సైకాలజీ, గణితం కోర్సులు ఉన్నాయని డిగ్రీలో ప్రవేశం పొందేవారు ఈనెల 4నుంచి తరగతులు ప్రారంభం అవుతాయని తెలిపారు. ఇతర వివరాలకు అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వెబ్‌సైట్, 7382929612 నంబరులో సంప్రదించాలని ఆమె కోరారు.



నకిలీ పాస్‌పోర్టుల కలకలం

- జిల్లాలో నకిలీ ధ్రువ పత్రాలతో పాస్‌పోర్టుల జారీ
- బయటపడుతున్న కేసులు
- అయినా బాధ్యులపై చర్యలు కరువు
- కేసులు నమోదైన సమయంలోనే మొక్కుబడి చర్యలు
- ఏళ్ల తరబడి ఒకేచోట పనిచేస్తున్న ఎస్‌బీ సిబ్బంది

జిల్లాలో నకిలీ ధ్రువపత్రాలతో పాస్‌పోర్టులు జారీ కేసు కలకలం రేపుతోంది. కేంద్ర ప్రభుత్వం పాస్‌పోర్టుల జారీ విషయంలో ఎన్ని నిబంధనలు పెట్టినా మోసాలు ఆగడం లేదు. జిల్లాలో పాస్ పోర్టులకు సంబంధించి గడిచిన రెండేళ్లుగా ఈ మోసాలు వెలుగులోకి వస్తున్నాయి. జిల్లాలో కొందరి సహకారంతో నకిలీ పత్రాలతో విదేశీయులకు పాస్‌పోర్టులు జారీ అవుతున్నాయి. సిబ్బందిపై నిఘా కొరవడడం, దీర్ఘ కాలికంగా పనిచేస్తున్న వారిని బదిలీ చేయకపోవడం వల్ల ఈ మోసాలు ఆగడం లేదు.

నిజామాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లా నుంచి గతంలో రోహింగ్యాలకు బోధన్ నుంచి పాస్‌పోర్టులు ఇవ్వగా ప్రస్తుతం శ్రీలంక వారికి భీమ్‌గల్‌తో పాటు ఇతర ప్రాంతాల నుంచి ఇవ్వడం వెలుగులోకి వచ్చింది. కేంద్ర విదేశాంగ శాఖ అధికారులు అప్రమత్తమై సీఐడీ అధికా రులకు సమాచారం ఇవ్వగా జిల్లాకు చెందిన ఓ ఏజెంట్‌తో పాటు సంబంధం ఉన్న ఏఎస్‌ఐని కూడా అదుపులోకి తీసుకున్నారు. గత కొన్ని రోజులుగా విచారణ కొనసాగిస్తున్నారు. ఏళ్ల తరబడి ఒకేచోట పని చేయడం నెలవారీగా సమీక్షలు లేకపోవడం వల్ల ఈ పరిస్థితి ఎదురవుతున్నట్లు ఉన్నతాధికారులు అంచనా వేస్తున్నారు.

జిల్లా నుంచి రోహింగ్యాలకు పాస్‌పోర్టులు

జిల్లా నుంచి గతంలో రోహింగ్యాలకు పాస్ పోర్టులు మంజూరయ్యాయి. బోధన్‌లోని కొన్ని అడ్రస్‌ల ద్వారా ఈ పాస్‌పోర్టులను తీసుకు న్నారు. ఆ సమయంలో అక్కడ పనిచేస్తున్న మీసేవ వారితో పాటు పోస్టల్, ఎస్‌బీకి చెందిన ఏఎస్సై సహకరించడంతో ఒకే అడ్రస్‌పై 75 పాస్‌పోర్టుల వరకు జారీ అయ్యాయి. ఆ సమయంలో అధికారులు వారిపై చర్యలు తీసుకున్నారు. ఆ స్కాంకు సంబంధించిన వారిని అరెస్టు చేశారు. అది మరవకముందే హైదరాబాద్ కేంద్రంగా శ్రీలంక వాసులకు పాస్‌పోర్టులు జారీ అయ్యాయి. వారికి భీమ్‌గల్, ఇతర ప్రాంతాలకు చెందిన ఏజెంట్లు సహకరించినట్లు తేలడంతో సీఐడీ అధికారులు పది రోజుల క్రితం వచ్చి ఆ ఏజెంట్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఆ తర్వాత దర్యాప్తు కొనసాగిస్తున్న అధికారులు జిల్లాకు చెందిన ఎస్‌బీలో పనిచేస్తున్న ఏఎస్‌ఐ స్థాయి అధికారిని అదుపులోకి తీసుకుని వెళ్లారు. భీమ్‌గల్ కేంద్రంగా జారీ అయిన పాస్ పోర్టులో పూర్తిస్థాయి తనిఖీలు చేయకుండా జారీ అయినట్లు సీఐడీ అధికారులు గుర్తించారు. దాని కనుగుణంగానే చర్యలు చేపట్టారు. బాధ్యులైన వారిపై కేసులు నమోదు చేశారు. మిగతా వారికోసం దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఎంతమంది శ్రీలంక వాసులకు జిల్లాతో పాటు జగిత్యాల, హైదరాబాద్ నుంచి జారీ అయ్యాయో ప్రత్యేక బృందాల ద్వారా దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

నివేదికల ఆధారంగానే పాస్‌పోర్టులు

జిల్లాలో ఎస్‌బీలో పనిచేస్తున్న కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్లు, ఏఎస్‌ఐలు ఇచ్చే నివేదికల ఆధారంగానే పాస్‌పోర్టులు మంజూరవుతున్నాయి. జిల్లా నుంచి ఎక్కువ మంది గల్ఫ్ దేశాలకు వెళ్తున్నారు. పాస్ పోర్టుల కోసం ప్రతిరోజూ వందలమంది దరఖాస్తు చేస్తున్నారు. వీటన్నింటిని ఆయా మండలాలకు నియమించిన ఎస్‌బీ అధికారులు ఇచ్చే నివేదికల ఆధారంగానే మంజూరవుతున్నాయి. ఎస్‌బీలో పనిచేస్తున్న వారి పనితీరును ప్రతినెలా ఉన్నతాధి కారులు సమీక్షిస్తారు. వారు ఏవైనా తప్పులు చేస్తే మందలించడంతో పాటు మరోసారి అటువంటివి చేస్తే వారి మాతృశాఖకు బదలీ చేస్తారు. ఎస్‌బీలో పనిచేస్తున్న వారు ఇచ్చే కీలక సమాచారం ఆధారంగానే ఇతర కేసులు కూడా పరిష్కారమవుతున్నాయి. పాస్ పోర్టులే కాకుండా ఇతర పనులు కూడా వీరు నిర్వర్తించాల్సి ఉంటుంది. నక్సల్ ఉద్యమం తీవ్రంగా ఉన్న సమయంలో ఎస్‌బీ, ఇంటెలిజెన్స్ కీలకంగా ఉండేది. ఇందులో చురుకైన వారిని నియమించే వారు వీరిచ్చే సమాచారం ఆధారంగానే జిల్లాలో పనిచేసిన ఎస్పీలు పరిష్కరించారు. నక్సల్ ఉద్యమాన్ని తగ్గించారు. ప్రస్తుతం నక్సల్ సమస్య జిల్లాలో లేదు. ఎస్‌బీలో పనిచేస్తున్న వారి పనితీరును వారి ఇన్‌చార్జి ఆధ్వర్యంలో సమీక్షించడంతో పాటు ప్రతినెలా కమిషనర్లు సమీక్షిస్తారు. గడిచిన కొన్నేళ్లుగా ఎ స్ బీ లో పనిచేస్తున్న వారిని బదిలీ చేయకపోవడం వల్ల ఒకేచోట ఏళ్లతరబడి వారు పనిచేస్తున్నారు. దీనివల్ల పాతుకపోవడంతో పాటు పాస్‌పోర్టు ఏజెంట్లకు సహకరించడం వల్ల ఇలాంటి మోసాలకు దారి తీస్తుంది. దేశానికి కానివారైన రోహింగ్యాలు, శ్రీలంక వాసులకు ఈ పాస్‌పోర్టులు అందుతున్నాయి. జిల్లా స్థాయి అధికారులు వీరిపై నజర్ పెట్టి మూడేళ్లు పూర్తిచేసుకున్న వారందరినీ బదిలీ చేస్తే కొంత వరకు ఈ రకం కేసులు ఆగనున్నాయి. పదోన్నతి వచ్చిన తర్వాత తమ మాతృ శాఖకు పంపించి కొత్తవారిని నియమిస్తే మరింత చురుకుగా పనిచేసే అవకాశం ఉంది. కాగా, కీలకంగా పనిచేసే ఎస్‌బీపై కమి షనర్‌తో పాటు ఉన్నత స్థాయి అధికారులు ప్రస్తుతం దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది.



బడ్జెట్‌పై పెదవి విరుపు

- సామాన్యుడికి ఉపయోగం లేదంటున్న ప్రతిపక్షాలు
- రాష్ట్రాన్ని మోదీ సర్కారు విస్మరించిందంటున్న కాంగ్రెస్
- అన్ని వర్గాలకు ఆమోదయోగ్యంగా ఉందంటున్న బీజేపీ
- కేంద్ర బడ్జెట్‌లో ఉమ్మడి జిల్లా ప్రాజెక్టులకు దక్కని కేటాయింపులు
- ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌పై మిశ్రమ స్పందన

కామారెడ్డి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో గురువారం ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌పై ఉమ్మడి జిల్లా ప్రజల ఆశలు అడియాసలయ్యాయి. ఎన్నికలవేళ వరాల జల్లు కురిపిస్తుందని అనుకున్న ప్రజలకు కేంద్రం నిరాశ పరిచిందని ప్రతిపక్షాలు మండి పడుతున్నాయి. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ సామాన్యుడికి ఉపయోగపడే విధంగా లేదని, తెలంగాణ రాష్ట్రాన్ని కేంద్రం విస్మరించిందని ప్రతి పక్ష నేతలు వాపోతున్నారు. కేవలం ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే అమలు కాని హామీలకు కేంద్రం బడ్జెట్ కేటాయింపులు చేసిందని కాంగ్రెస్ విమర్శించింది. అదే విధంగా కేంద్ర ఆర్థికశాఖమంత్రి ప్రవేశ పెట్టిన బడ్జెట్ అన్ని వర్గాలప్రజలకు ఆమోదయోగ్యంగా ఉందని బీజేపీ అభిప్రాయం వ్యక్తం చేస్తుంది. ఉచితాలకు తావివికుండా పేదలకు ఉపయోగ కరంగా ఉండే పథకాలకు బడ్జెట్‌లో అధిక ప్రాధాన్యం కల్పించారని బీజేపీ నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రాజెక్టులకు నిధులు విడుదలయ్యేనా?

ఉమ్మడి జిల్లాలో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న రైల్వే ప్రాజెక్టులకు, జాతీయ రహదారుల నిర్మాణానికి కేంద్ర బడ్జెట్‌ప్రవేశపెట్టిన ఆయా శాఖలకు కేటాయించిన నిధుల నుంచి కేటాయింపులు వస్తాయో లేవో చూడాలి. మహారాష్ట్రలోని ముత్కెడ్ నుంచి నిజామాబాద్ హైదరాబాద్ వరకు డబుల్ రైల్వే లైన్ ఏర్పాటుకు ఎనిమిది నెలల కిందటే కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అయితే ఈ పనులకు కేంద్ర రైల్వే శాఖ నిధుల ఖర్చు ప్రతిపాదనలు చేసింది. ఈ నేపథ్యంలో ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో రైల్వె శాఖకు రూ.2.55లక్షల కోట్ల నిధులను కేటాయించారు. ఈ నిధులోంచి డబుల్‌లైన్‌కు ఎన్ని నిధులు కేటాయిస్తారో చూడాలి. అదేవిధంగా బోదన్-బాన్సువాడ-బీదర్ కొత్త రెల్వేలైన్‌కు ఆమోదం లభించిన పనులకు నిధులు కేటాయించలేదు. అలాగే కరీంనగర్, కామారెడ్డి, పిట్లం వరకు జాతీయ రహదారి నిర్మాణానికి సైతం ఈ బడ్జెట్ నిధులు కేటాయించాల్సి ఉంటుంది. కేంద్ర రోడ్డు రవాణాశాఖకు రూ.2.78లక్షల కోట్ల నిధులను కేటాయించారు. ఈ బడ్జెట్‌లోను ఈ శాఖనుంచి కేకేవై జాతీయ రహదారి నిర్మాణానికి కేటాయింపులు జరుగుతాయా లేదో చూడాలి. పారిశ్రామిక ప్రోత్సా హకాలకు రూ.6,200 కోట్ల నిధులను కేంద్రం బడ్జెట్‌లో పొందుపరిచింది. ఈ నిధుల్లోంచి నిజామా బాద్ జిల్లాలో ఏర్పాటు చేస్తామన్న పసుపుబోర్డు పరిశ్రమకు ఎంతమేర వస్తాయో చూడాలి.

ఆయుష్మాన్ భారత్‌లోకి అంగన్‌వాడీ,ఆశాలు

దేశవ్యాప్తంగా ఉన్న అంగన్‌వాడీలు, ఆశావర్కర్లు, హెల్పర్‌లకు కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మల సీతారామన్ శుభవార్త చెప్పారు. కేంద్రం అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్ కిందకు అంగన్‌వాడీ, ఆశావర్కర్లు, హెల్పర్‌లకు వర్తించనుందన్నారు. ప్రస్తుతం ఆయుష్మాన్ కార్డుపై కుటుంబానికి రూ.5లక్షల వరకు ఆరోగ్యబీమా సదుపాయం కేంద్రం కల్పించనుంది.

ఆదాయ పన్ను మినహాయింపు పరిమితి పెంచని కేంద్రం

కేంద్రం పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో సా మాన్యుడికి ఊరట నిచ్చేవిధంగా ఆదాయ పన్ను మినహాయింపు ప్రకటిస్తారని అంతా భావించారు. ఈ బడ్జెట్‌లో ఆదాయ పన్ను 10లక్షల వరకు మినహాయింపు ఇస్తారని మధ్యతరగతి ప్రజలు ఆశించారు. కానీ ఆదాయ పన్నుపై బడ్జెట్‌లో ఎలాంటి ప్రకటన చేయలేదు. దీంతో ప్రజలు కాస్త నిరాశకు గురయ్యారు. కానీ 2009-10 ఆర్థిక సంవత్సరం వరకు పెండింగ్‌లో ఉన్న రూ.25వేల లోపు ట్యాక్స్ డిమాండ్‌లను విత్‌డ్రా చేసుకుంటున్నట్లు ప్రకటించింది. అలాగే 2011-15 ఆర్థిక సంవత్సరాల మధ్య రూ.10 వేల లోపు ఉన్న వివాదాస్పద పన్ను డిమాండ్‌లను ఉపసంహరిస్తున్నట్లు బడ్జెట్‌లో ప్రతిపాదించారు. దీంతో కోటి మంది పన్ను చెల్లింపుదారులకు ప్రయోజనం కలుగనుంది.

మధ్యతరగతికి మొండిచేయి..

: సుధాకర్, (సీపీఐ జిల్లా కార్యదర్శి)

పేద మధ్య తరగతి ప్రజలను మోసం చేసేలా కేంద్ర మధ్యంతర బడ్జెట్ ఉంది. ఆదాయపు పన్నులు పదిలక్షల వరకు మినహాయింపు ఇస్తారని మధ్యతరగతి వర్గం ఆశించింది. కానీ ఎలాంటి మార్పు లేకుండా మొండి చేయి చూపింది. కేవలం 25వేల రూపాయలు స్టాండర్డ్ డిడక్షన్‌లో పెంచి స్లాబ్‌లలో ఎలాంటి మార్పులు చేయలేదు.

ప్రజల ఆశలపై నీళ్లుచల్లిన కేంద్ర బడ్జెట్..

: రమేష్‌బాబు (సీపీఎం జిల్లా కార్యదర్శి)

పార్లమెంటులో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్ సామాన్య, మధ్య తరగతి ప్రజానీకాన్ని తీవ్ర నిరాశకు గురిచేసింది. గత తొమ్మిది సంవత్సరాలు ప్రవేశపెట్టిన పద్ధతిలోనే ఈ బడ్జెట్‌లో కూడా కార్పొరేట్ కంపెనీలకు, పెట్టుబడిదారులకు ఉపయోగపడే పద్ధతిలో ఉంది. ప్రజల ఆశలపై నీళ్ల చల్లింది.

అన్ని వర్గాల సంక్షేమ బడ్జెట్..

:దినేష్‌కులాచారి (బీజేపీ జిల్లా అధ్యక్షుడు)

పేద, రైతుల సంక్షేమం దృష్టిలో పెట్టుకుని కేంద్రం ఈ బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం జరిగింది. రైతులు, ఉద్యోగులు, పేద ప్రజలకు, వ్యాపారులకు ఈ బడ్జెట్ ఎంతో ఉపయోగకరంగా ఉంది. వికసిత్ భారత్ లక్ష్యంగా అన్ని వర్గాల ప్రజల ప్రయోజనాలు పరిరక్షించే విధంగా చరిత్రాత్మక బడ్జెట్‌ను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టారు.



అధికారుల బదిలీలకు రంగం సిద్ధం

- అధికారుల బదిలీలకు కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశం
- జాబితాను సిద్ధం చేసిన జిల్లా యంత్రాంగం
- ఒకటి రెండ్రోజుల్లో బదిలీ కానున్న ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఎస్సైలు

నిజామాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో దీర్ఘకాలికంగా పనిచేస్తున్న అధికారుల బదిలీకి రంగం సిద్ధమవుతోంది. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో మూడేళ్లు పూర్తిచేసుకున్న మండల, డివిజన్ స్థాయి అధికారులను బదిలీచేయాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు ఇవ్వడంతో అధికారులు జాబితాను పంపించారు. ఒకటి రెండ్రోజుల్లోనే జిల్లాలో పనిచేస్తున్న మండలస్థాయి అధికారులను బదిలీచేసే అవకాశం ఉంది. ఇప్పటికే జిల్లాలో పనిచేస్తున్న సీఐలను బదిలీచేయగా అదే రీతిలో ఎస్‌ఐలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు పెద్ద ఎత్తున బదిలీ కానున్నారు. వీరితోపాటు డివిజన్‌స్థాయిలో పనిచేస్తున్న అధికారులను కూడా బదిలీ చేయనున్నారు. ఎన్నికలతో సంబంధం ఉన్న మండల, డివిజన్, జిల్లా స్థాయి అధికారులను బదిలీ చేయాలని ఎన్నికల కమిషన్ ఆదేశాలు ఇవ్వడంతో రాష్ట్ర ఉన్నతాధికారులు ఈ బదిలీలు చేపడుతున్నారు.

త్వరలో ఎంపీ ఎన్నికల షెడ్యూల్

కేంద్ర ఎన్నికల కమిషన్ పార్లమెంట్ ఎన్నికల కోసం ఈ నెలలోనే షెడ్యూల్‌ను విడుదల చేయనుంది. ఆలోపే జిల్లాలో దీర్ఘకాలికంగా పనిచేస్తున్న అధికారులతో పాటు మూడేళ్లు పూర్తిచేసుకున్న అధికాలను బదిలీ చేయాలని ఆదేశాలు ఇచ్చింది. దీంతో జిల్లాలో పనిచేస్తున్న మండలస్థాయి అధికారులతో పాటు డివిజన్ సాయి అధికారులు, జిల్లాస్థాయి అధికారుల జాబితాను సిద్ధం చేశారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్, ప్రభు త్వానికి పంపించారు. జిల్లాలో ఎంపీడీవోలు దీర్ఘకాలికంగా పనిచేస్తు న్నారు. కొంతమంది ఎంపీడీవోలు మండలాల్లో మూడేళ్లు పూర్తిచేసుకోగా, మరికొంత మంది అంతకన్నా ఎక్కువ సంవత్సరాలు అదే మండలంలో పనిచేస్తున్నారు. శాసన సభ ఎన్నికల సమయంలో వీరిని బదిలీ చేయలేదు. ఆ ఎన్నికల్లో వీరు సెక్టోరియల్ అధికారులుగా పనిచేశారు. ఈ దఫా వీరిని కూడా బదిలీ చేయాలని ఆదేశాలు ఇవ్వడంతో జాబితాను పంపించారు.

జిల్లాలో 24మంది ఎంపీడీవోలు

జిల్లాలో ప్రస్తుతం 24మంది ఎంపీడీవోలు పనిచేస్తున్నారు. వీరిలో ముగ్గురు జూన్‌లోపు పదవీ విరమణ చేయనున్నారు. వీరిని మినహాయిస్తే మిగతా 21మందిని బదిలీ చేయనున్నారు. వారి జాబితాను ప్రభుత్వానికి పంపించారు. వీరితోపాటు డిప్యూటీ సీఈవోలుగా పనిచేస్తున్న అధికారులు కూడా బదిలీ కానున్నారు. వీరిని రాష్ట్రంలోని ఏ జిల్లాకైనా బదిలీ చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. వచ్చే పార్లమెంట్ ఎన్నికలతో పాటు ఆ వెంటనే మండల పరిషత్ ఎన్నికలు ఉండడం వల్ల వీరిని బదిలీ చేస్తు న్నారు. జిల్లాలో పనిచేస్తున్న ఇతర అధికారులను కూడా బదిలీ చేయనున్నారు. శాసనసభ ఎన్నికల సమయంలో జిల్లాలో పనిచేసిన 80శాతం మంది ఎమ్మార్వోలను ఇతర జిల్లా లకు బదిలీ చేశారు. మల్టీజోన్ 1 పరిధిలోని జిల్లాల నుంచి తహసీల్దార్లు బదిలీపై జిల్లాకు వచ్చారు. ఆ బదిలీ సమయంలో లూప్‌లైన్‌లో ఉన్న వారితో పాటు అప్పుడు బదిలీ కాని తహసీల్దార్లను ఈ దఫా బదిలీ చేయనున్నారు. కేంద్ర ఎన్నికల కమిషన్ ఈనెల 6న ఓటర్ల ఫైనల్ లీస్టును ప్రకటిస్తుంది. ఆలోపే అధికారుల బదిలీని చేపట్టనుంది. జిల్లాలో పనిచేస్తున్న సీఐ స్థాయి అధికారులను ఇప్పటికే బదిలీ చేశారు. ఎన్నికల కమిషన్ ఆదే శాలకనుగుణంగా మల్టీజోన్ పరిధిలోని జిల్లాలకు వారిని పంపించారు. ఇతర జిల్లాల నుంచి సీఐలను జిల్లాలో నియమించారు. వీరితో పాటు రెండు రోజుల్లో జిల్లాలో పనిచేస్తున్న ఎస్‌ఐలను కూడా బాసరజోన్ పరిధిలో బదిలీ చేయనున్నారు. వీరిని నిర్మల్, జగిత్యాల, ఆదిలాబాద్ జిల్లాలకు పంపించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. వీరితో పాటు డివిజన్ స్థాయిలో పనిచేస్తు ఎన్నికల విధులకు సంబంధం ఉన్న ఆర్డీవోలు, ఏసీపీలతోపాటు ఇతర శాఖల అధికారులను కూడా బదిలీచేసే అవకాశం ఉంది.

ప్రత్యేక అధికారుల పాలనకే ప్రభుత్వం మొగ్గు

నిజామాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో శుక్రవారం నుంచి ప్రత్యేక అధికారుల పాలన మొదలుకానుంది. పర్సన్ ఇన్‌చార్జిలకు బదులుగా ప్రత్యేక అధికారులను నియమించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వం జీవో నెం.5ను జారీచేసింది. గ్రామాల్లో ఇక ప్రత్యేక అధికారుల పాలన మొదలవుతుందని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా ఈ మేరకు ఉత్తర్వులను జారీచేశారు. గ్రామస్థాయిని బట్టి ఎంపీడీవోలు, ఎమ్మార్వోలు, వ్యవసాయ అధికారులు, ఎం ఈవోలు, ఎంపీవోలతోపాటు అదేస్థాయి కలిగిన సాగునీటిశాఖ, రోడ్లు భవనాలు, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, తాగునీటిశాఖకు చెందిన ఏఈలు, ఇతర శాఖల అధికారులను నియమించాలని ఆదేశాలను ఇచ్చారు. ప్రభుత్వ ఆదేశాలకనుగుణంగా ప్రత్యేక అధికారుల పాలన నేటినుంచి మొదలుకానుంది. ఈ జీవో ప్రకారం అధికారులను గ్రామాల ప్రత్యేక అధికారులుగా కలెక్టర్ నియమించారు. వారికి ఉత్తర్వులను జారీచేశారు. జిల్లాలోని 530 గ్రామ పంచాయతీల్లో ఈ ప్రత్యేక అధికారుల నియామకం చేశారు. వీరి ఆధ్వర్యంలోనే సర్పంచ్ ఎన్నికలు నిర్వహించేంత వరకు గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగనుంది. లబ్ధిదారుల ఎంపికతో పాటు అభివృద్ధి పనుల కార్యక్రమాలు కూడా వీరి ఆధ్వర్యంలోనే కొనసాగనున్నాయి. గ్రామాల్లో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులతో పాటు ఇతర సిబ్బందితో సమన్వయం చేసుకుని ప్రత్యేక అధికారులు పనిచేయనున్నారు.

కొనసాగుతున్న నిరసన

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి1: మున్సిపల్ ఇన్‌చార్జీ చైర్మన్‌ను నియమించాలని పట్టణంలోని ముస్లిం మైనారిటీ నాయకులు చేడపతున్న నిరసన గురువారం ఐదో రోజుకు చేరింది. మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీతపై అవిశ్వాస తీర్మానం నెగ్గి 28 రోజులు అయినా ఇప్పటివరకు ఇన్‌చార్జీ చైర్మన్‌ను నియామించకపోవడంతో అభివృద్ధి కుంటుపడుతుందని ఎన్నికల అధికారి అవిశ్వాసం నెగ్గిన తీర్మాన కాపీని కలెక్టర్‌కు పంపగా ఆ రిపోర్టును రాష్ట్ర ప్రభుత్వానికి పంపారని నూతన చైర్‌పర్సన్ ఎన్నిక ప్రక్రియ ప్రారంభించకుండా అధికారులు కాలయాపన చేస్తున్నారని తెలిపారు. మైనారిటీకి చెందిన మున్సిపల్ వైస్‌చైర్మన్ షేక్‌మున్నను ఇన్‌చార్జీ చైర్మన్‌గా నియామించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

'ప్రజావ్యతిరేక విధానాలను మానుకోవాలి'

బోధన్ రూరల్, ఫిబ్రవరి1: కేంద్ర ప్రభుత్వం ప్రజా, రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను మానుకోవాలని ఐఎఫ్‌టీయూ, సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. కేంద్రం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక రైతు, వ్యవసాయ కూలీల వ్యతిరేక విధానాలకు నిరసనగా కార్మిక సంఘాలు, వివిధ రంగాల ఉద్యోగ సంఘలు ఈనెల 16న అఖిల భారత స్థాయిలో సమ్మెతోపాటు గ్రామీణ భారత్‌బంద్ పాటిస్తున్నాయని, మున్సిపల్ కార్మికులు భాగస్వాములై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ, సీఐటీయూ నాయకులు మల్లేష్, శంకర్‌గౌడ్‌లు అన్నారు. బుధవారం 16న నిర్వహించే సమ్మె పత్రాన్ని బోధన్ మున్సిపల్ కమిషనర్‌కు అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా కార్మికులకు 26 వేల వేతనం అందించాలన్నారు. నాలుగు లేబర్ కోడ్స్, విద్యుత్ సవరణ బిల్లు 2022 రద్దు చేయాలన్నారు. కార్మికులందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని, బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు తదితరులు ఉన్నారు.

శిలాఫలకాన్ని కూల్చిన గుర్తు తెలియని వ్యక్తులు

భీమ్‌గల్‌రూరల్, ఫిబ్రవరి 1: మండలంలోని ముచ్కూర్ గ్రామంలో బుధవారం అర్ధరాత్రి గ్రామ పంచాయతీ ఆవరణలోని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ 2007లో నిర్మించిన శిలాఫలకాన్ని గుర్తు తెలియని వ్యక్తులు కూల్చివేశారు. గురువారం ఉదయం శిలాఫలకం కూలిఉండడాన్ని గమనించి స్థానిక గ్రామ పంచాయతీ సిబ్బందికి సమాచారం అందించారు. పంచాయతీ కార్యదర్శి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్సై హరిబాబు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తామని తెలిపారు.

జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు గురుకుల విద్యార్థిని ఎంపిక

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 1: ఈనెల 3నుంచి 7వరకు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో జరిగే జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ధర్మారం(బీ) విద్యార్థిని నేహ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సంగీత తెలిపారు. ఆర్మూర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో నేహ మంచి ప్రతిభ కనబర్చిందని, ఆమె పేర్కొన్నారు. జాతీయస్థాయిలో కూడా నేహ మంచి ప్రతిభ చూపాలని ప్రిన్సిపాల్ సంగీత,ఫిజికల్ డైరెక్టర్ నీరాజరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ కిషన్, పీఈటీ జ్యోత్స్నలు ఆకాంక్షించారు.

గ్రామాల్లో సీసీ కెమెరాలను అమర్చుకోవాలి

ముప్కాల్, ఫిబ్రవరి1: ఒక్క సీసీ కెమెరా వంద పోలీసులతో సమానమని, ప్రతీ గ్రామంలో సీసీ కెమెరాలను అమర్చుకోవాలని హెడ్‌కానిస్టేబుల్ విఠల్ అన్నారు. గురువారం బాల్కొండ మండలంలోని బస్సాపూర్, నాగాపూర్ గ్రామాలలో కమ్యూనిటీ పోలీస్ కార్యక్రమంలో భాగంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని అవగాహన కల్పించారు. ప్రజలకు పోలీసులు చట్టా వ్యతిరేక కార్యక్రమాలపై వివరించారు. మారకద్రావ్యల వినియోగంతో భవిష్యత్ అంధకారమవుతుందని, యువత మత్తుపదార్థాలు వినియోగించుకోకుండా భవిష్యత్‌ను బంగారుబాట రావాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రాణరక్షణ నైపుణ్యాలపై మత్స్యకారులకు శిక్షణ

డొంకేశ్వర్, ఫిబ్రవరి 1: మండలంలోని రైతు వేదికలో నేషనల్ ఫిషరీష్ డెవలప్‌మెంట్ (ఎన్‌ఎఫ్‌డీబీ) ఇండియా ఇమ్యూనాలజీ లిమిటెడ్ ఆధ్వర్యంలో ప్రాణరక్షణ నైపుణ్యాలపై గురువారం మత్స్యకారులకు శిక్షణ నిర్వహించారు. డొంకేశ్వర్ మండల పరిధిలో శ్రీరాంసాగర్‌ప్రాజెక్టు జలశయంలో చేపల వేటకు వెళ్తున్న 90మంది మత్స్యకారులకు ప్రాణ నైపుణ్యాలపై అవగాహన కల్పించారు. చేపలవేటకు వెళ్లే సమయంలో జరిగే ప్రమాదాలను నివారించడం, ప్రమాదాల నుంచి కాపాడుకోవడం, ప్రమాదం జరిగిన వ్యక్తికి ప్రథమ చికిత్స అందించడం, ఆ సమయంలో ఉపయోగించే పరికరాలను ఇండియన్ రెస్క్యూ అకాడమి ఆధ్వర్యంలో అవగాహన నిర్వహించారు. మత్స్య కార్మికులకు గ్రూప్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ స్కీం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్య శాఖ అధికారి నర్సయ్య, జాతీయ మత్స్యశాఖ అభివృద్ధి బోర్డు సీనియర్ ఎగ్జిక్యూటీవ్ కంచి బార్గవి, జిల్లా మత్స్యశాఖ అధ్యక్షుడు కన్న శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో సూచనలు చేస్తున్న దృశ్యం

భారత్‌కు 31 సాయుధ డ్రోన్లు

వాషింగ్టన్, ఫిబ్రవరి1: వాస్తవాధీన రేఖ వెంబడి చైనాకు చెక్ పెట్టేందుకు.. హిందూ మహాసముద్రంలో పట్టు పెంచుకునేందుకు ఇండియాకు ఎంతగానో ఉపయోగపడే ఎమ్‌క్యూ-9బి ప్రిడేటర్ డ్రోన్లను విక్రయించడానికి అమెరికా ప్రభుత్వం గురువారం ఆమోదం తెలిపింది. ఈ డీల్ కింద 3.99 బిలియన్ డాలర్ల (సుమారు రూ.33వేల కోట్లు) విలువైన 31 డ్రోన్లను అమెరికా సరఫరా చేయనుంది. ఎమ్‌క్యూ-9బి రిమోట్లీ పైలెటెడ్ ఎయిర్‌క్రాఫ్ట్‌గా పిలిచే ఈ సాయుధ డ్రోన్ల కొనుగోలుపై గత జూన్‌లో ప్రధాని మోదీ అమెరికాలో పర్యటన సందర్భంగా ఇరు దేశాల మధ్య అంగీకారం కుదిరింది. ఇందుకు అవసరమైన అనుమతి మంజూరు చేస్తూ అమెరికా కాంగ్రెస్ సర్టిఫికెట్ ఇచ్చిందని డిఫెన్స్ సెక్యూరిటీ కో-ఆపరేషన్ ఏజెన్సీ తాజాగా తెలిపింది. అమెరికా-భారత్ మధ్య వ్యూహాత్మక సంబంధాల బలోపేతంలో భాగంగా ఈ మెగా డ్రోన్‌డీల్ జరిగిందని పేర్కొంది. భారత్ భద్రతను పెంచేందుకు, ఇండో-పసిఫిక్, దక్షిణాసియా ప్రాంతంలో సుస్థిర, శాంతి, ఆర్థిక ప్రగతిని పెంపొందించేందుకు ఇది ఉపకరిస్తుందని తెలిపింది. మానవరహిత నిఘా విషయంలో భారత్ సామర్థ్యాలు మరింత బలోపేతమవుతాయని అభిప్రాయపడింది. సైన్యం ఆధునికీకరణకు భారత్ కట్టుబడి ఉందని, అందువల్ల వీటిని అందజేయడంలో తమకు ఇబ్బందేమీ లేదని పేర్కొంది. వీటిని హై ఆల్టిట్యూడ్ లాంగ్ ఎండ్యూరెన్స్ (హెచ్ఏఎల్ఈ-హేల్)యూఏవీలుగా వ్యవహరిస్తారు. ఈ 31లో 15 డ్రోన్లను సీగార్డియన్ల పేరుతో నేవీకి ఇస్తారు. స్కై గార్డియన్ పేరుతో ఎయిర్‌ఫోర్స్‌కు 8డ్రోన్లు, ల్యాండ్ వర్షన్ పేరుతో ఆర్మీకి మిగతా 8కేటాయిస్తారు. ఖలిస్థాన్ ఉగ్రవాది గురుప్రీత్ సింగ్ పన్నూన్ హత్యకు భారత్ కుట్రపన్నుతున్నందున డ్రోన్లఅమ్మకాల ఒప్పందాన్ని అమెరికా నిలిపివేస్తుందంటూ వార్తలువచ్చిన నేపథ్యంలో కాంగ్రెస్ ఆమోదం లభించింది.

వీసా ఫీజులు భారీగా పెంచిన అమెరికా

వాషింగ్టన్, ఫిబ్రవరి1: అమెరికాకు వచ్చే విదేశీయుల నుంచి వసూలు చేసే నాన్-ఇమిగ్రెంట్ వీసా ఫీజులను బైడెన్ ప్రభుత్వం బుధవారం భారీగా పెంచింది. వీసా ఫీజులను పెంచడం 2016 తర్వాత ఇదే ప్రథమం. ఏప్రిల్1 నుంచి ఇవి అమల్లోకి వస్తాయి. భారతీయులకు అత్యంత ఉపయోగకరంగాఉండే హెచ్-1బీ, ఎల్-1, ఈబీ-5 వీసాల రుసుములు గణనీయంగా పెరిగాయి. విదేశాల వృత్తి నిపుణులు అమెరికాలో ఉద్యోగాలు చేయడానికి హెచ్-1బీ వీసాలు ఇస్తారు. ఇందుకు ఉద్దేశించిన ఫారం 1-129 ఫీజు 460డాలర్ల (రూ.38,150)నుంచి 780డాలర్ల (రూ.64,690)కు పెరిగింది. హెచ్-1బీ వీసాల రిజిస్ట్రేషన్ రుసుము 10 డాలర్ల నుంచి 215 డాలర్ల (రూ.17,830)కు పెంచారు. ఈ నిర్ణయం వచ్చే ఏడాది నుంచి అమల్లోకి వస్తుంది. బహుళజాతి కంపెనీ ఉద్యోగుల బదిలీకి ఉద్దేశించిన ఎల్-1 వీసాల రుసుములు 460డాలర్ల నుంచి 1,385 డాలర్ల (రూ.1,14,860)కు పెరిగాయి. అమెరికా పౌరులకు ఉద్యోగాలిచ్చే వారికి ఈబీ-5 వీసాలు మంజూరు చేస్తారు. వీటి రుసుములు 3,675డాలర్ల నుంచి 11,160 డాలర్ల (రూ.9,25,510)కు పెరిగాయి. మరికొన్ని రకాల వీసాల ఫీజులు స్వల్పంగా తగ్గాయి.

కాంగ్రెస్ వలలో పడొద్దు

(మొదటి పేజీ తరువాయి)

చేయకండి. సీఎంను కలవాలనుకుంటే సమాచారం ఇచ్చి వెళ్లండి' అని సున్నితంగా హెచ్చరించినట్లు సమాచారం. "కాంగ్రెస్ ప్రభుత్వం చాలా సవాళ్లను ఎదుర్కొనాల్సి ఉంది. రాష్ట్ర ఆదాయం అంతంత మాత్రంగా ఉంది. కనీసం అంచనా వేయకుండానే ఇబ్బడిముబ్బడి హామీలిచ్చారు. అమలు చేయలేక ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం ఉంటుందా? ఉండదా? అనేది వారి చేతుల్లోనే ఉంది. ప్రతిపక్షంగా సమర్థంగా వ్యవహరిద్దాం. ఏడాది లోపే ప్రజలకు అసలు విషయం తెలుస్తుంది. మనం తొందరపడాల్సిన పనిలేదు. సంయమనం పాటిద్దాం. చక్కగా నిలబడితే చాలు.. వచ్చే ప్రభుత్వం మనదే"నని కేసీఆర్ పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలించామని.. ఓడిపోయినంత మాత్రాన నిరుత్సాహం, భయడాల్సిన అవసరం లేదన్నారు. కృష్ణా ప్రాజెక్టులను కృష్ణా బోర్డుకు అప్పగించే అంశంపై పార్లమెంటులో నిరసన తెలపాలని ఎంపీలకు సూచించారు. కేంద్ర జల శక్తి శాఖ మంత్రినీ కలవాలని నిర్దేశించారు. లోక్‌సభ ఎన్నికల్లో గట్టిగా పోరాడదామని.. అందరితో చర్చించి, మంచి అభ్యర్థులను ప్రకటిస్తామని తెలిపారు.

అసాధ్యమని ఆర్బీఐనే చెప్పింది

రూ.36 వేల కోట్ల రైతు రుణమాఫీ అసాధ్యమని, ఏక మొత్తంలో ఇన్ని కోట్లు మాఫీ వీలుకాదని ఆర్బీఐ తెలిపిందని పార్టీ నేతల వద్ద కేసీఆర్ వ్యాఖ్యానించారు. అయినా.. ఏపీలో చెల్లించారు. తెలంగాణలోనూ రుణమాఫీ చేస్తామంటూ సీఎం రేవంత్‌రెడ్డి రైతాంగాన్ని తప్పుదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. "మనం అధికారంలో ఉన్నప్పుడే కేంద్ర ప్రభుత్వం ఏమీ చేయలేదు. కాంగ్రెస్ ఉంటే చేస్తుందా? వాళ్లకూ చేయదు. శుక్రవారం తెలంగాణ భవన్‌కు వస్తా. బడ్జెట్ సమావేశాల్లో పాల్గొంటా" అని కేసీఆర్ తెలిపారు. కాగా, బడ్జెట్ సమావేశాల్లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అనుసరించాల్సిన తీరుపై అంశాల వారీగా చర్చించారు. కేటీఆర్, పోచారం, హరీశ్‌రావు, తలసాని, ప్రశాంత్‌రెడ్డి, మల్లారెడ్డి, జగదీశ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేగా ప్రమాణం

గజ్వేల్ ఎమ్మెల్యేగా కేసీఆర్ గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. శాసనసభ స్పీకర్ గడ్డ ప్రసాద్ తన



చాంబర్‌లో మధ్యాహ్నం 12.45 గంటలకు ఆయనతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, పోచారం, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్య నేతలు పాల్గొన్నారు. అనంతరం అసెంబ్లీ ఆవరణలోని ప్రతిపక్ష నేత చాంబర్‌లో కేసీఆర్ ప్రత్యేక పూజలు చేసి బీఆర్ఎస్ శాసనసభాపక్ష నేతగా బాధ్యతలు చేపట్టారు. కాగా, ఈ కార్యక్రమాలకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్‌రెడ్డి, చింతా ప్రభాకర్, కాలె యాదయ్య, పద్మారావుగౌడ్ హాజరు కాలేదని సమాచారం.

రేవంత్ నేను పాత మిత్రులం!

త్వరలోనే రేవంత్‌ను కలుస్తా: మల్లారెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): "నేను రేవంత్‌రెడ్డి పాత మిత్రులం. టీడీపీలో కలిసి పనిచేశాం. ఇప్పుడు ఆయన రాష్ట్ర సీఎం. అయనను కలిస్తే తప్పేంటి" అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. రేవంత్‌ను త్వరలోనే కలుస్తానని చెప్పారు. కీసర ఆలయంలో నిర్వహించబోయే పూజా కార్యక్రమాలకు ఆహ్వానిస్తానని తెలిపారు. గురువారం అసెంబ్లీ ప్రాంగణంలో మల్లారెడ్డి మీడియాతో మాట్లాడారు. మల్కాజిగిరి ఎంపీ స్థానంలో పోటీ చేయాలని బీఆర్ఎస్ అధిష్ఠానం తనను కోరుతోందని చెప్పారు. అయితే, తన కుమారునికి అవకాశం కల్పించాలని అధిష్ఠానానికి విజ్ఞప్తి చేశానన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తాను పోటీ చేయబోనని చెప్పారు. అయితే, "రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఆ పార్టీ వాళ్లకు షాక్.. అధికారం కోల్పోవడం మాకు షాక్" అని మల్లారెడ్డి వ్యాఖ్యానించారు. కాగా, హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారం నెమ్మదించిందన్న మల్లారెడ్డి.. త్వరలో గోవాలో రియల్ వ్యాపారం చేస్తానని చెప్పారు. ఇప్పటికే గోవాలో ఓ హోటల్ కొన్నట్లు తెలిపారు.

పాత.. కొత్త స్పీకర్ల కలయిక!



బాన్సువాడ టౌన్, ఫిబ్రవరి 1: ప్రత్యేక తెలంగాణ ఏర్పడ్డాక రాష్ట్రంలో అసెంబ్లీ స్పీకర్లుగా పనిచేసిన, చేస్తున్న ముగ్గురు ఒకచోట కలిశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తరఫున అసెంబ్లీ స్పీకర్‌గా 2014-19 వరకు మధుసూదనా చారి, 2019-23 వరకు పోచారం శ్రీనివాస్‌రెడ్డి కొనసాగారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం తరఫున 2023 డిసెంబరు నుంచి గడ్డం ప్రసాద్.. స్పీకర్‌గా కొనసాగుతున్నారు. గురువారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యేగా కేసీఆర్ ప్రమాణ స్వీకారం సందర్భంగా వారు ముగ్గురు కలిశారు. ఈ సందర్భంగా ముగ్గురూ కలిసి ఫొటో దిగారు.

టచ్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు.. హైకమాండ్ వద్దనడంతో ఆగాం

▸ ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ

కామారెడ్డి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): "బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చాలా మంది కాంగ్రెస్‌తో టచ్‌లో ఉన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని పలువురు ఎమ్మెల్యేలు కలవడమే ఇందుకు నిదర్శనం. వారంతా కాంగ్రెస్‌లో చేరే అవకాశాలున్నాయి. అయితే.. హైకమాండ్ ఇప్పుడప్పుడే పార్టీ ఫిరాయింపులు వద్దని చెప్పింది. అందుకే.. ఫిరాయింపులను ప్రోత్సహించడంలేదు" అని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ వ్యాఖ్యానించారు. గురువారం ఆయన కామారెడ్డిలో జరిగిన ఉచిత వైద్య శిబిరంలో పాల్గొని ప్రసంగించారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఒక్క సీటు కూడా గెలవదన్నారు. కేటీఆర్ అహంకారపూరితంగా మాట్లాడుతున్నారంటూ షబ్బీర్ అలీ మండిపడ్డారు. "రాష్ట్ర ప్రజలు బీఆర్ఎస్‌ను ఛీ కొట్టినప్పటికీ కేటీఆర్ అహంకారం తగ్గడంలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు కాకముందే సర్కారును కూల్చేస్తామని, త్వరలోనే ప్రభుత్వం పడిపోతుందంటూ కేటీఆర్ అహంకారపూరిత మాటలు మాట్లాడుతున్నారు. ప్రభుత్వాన్ని ఎలా కూలుస్తారో చూస్తాం" అని సవాల్ విసిరారు. పదేళ్లుగా రాష్ట్రాన్ని బీఆర్ఎస్ లూటీ చేసిందని ఆరోపించారు. ఓ అధికారి వద్దే రూ.100 కోట్ల అవినీతి సొమ్ము బయటపడడం బీఆర్ఎస్ పాలనకు నిదర్శనమని ఆయన విమర్శించారు.

ఎంపీ టికెట్ ఆశావహులతో గాంధీభవన్‌లో సందడి

కాంగ్రెస్ టికెట్ కోసం 41 మంది దరఖాస్తులు

హైదరాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నుంచి లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు దరఖాస్తులు సమర్పించడానికి వచ్చిన ఆశావహులు, వారి అనుచరులతో గాంధీభవన్‌లో గురువారం సందడి నెలకొంది. పార్టీ తరఫున తమకు టికెట్ కేటాయించాలని కోరుతూ 41 మంది అభ్యర్థులు దరఖాస్తులు ఇచ్చారు. బుధవారం ఏడుగురు దరఖాస్తు చేసుకోగా గురువారం 34 మంది పార్టీ అభ్యర్థిత్వాన్ని ఆశిస్తూ దరఖాస్తులను సమర్పించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సతీమణి ఖమ్మం పార్లమెంట్ స్థానానికి దరఖాస్తు చేశారు. అదే నియోజకవర్గం నుంచి తనకు అవకాశం కల్పించాలని పార్టీ సీనియర్ నేత వి.హన్మంతరావు దరఖాస్తు సమర్పించారు. భువనగిరి నుంచి చామల కిరణ్ కుమార్ రెడ్డి, నిజామాబాద్ నుంచి ఆకుల లలిత తదితరులు లోక్‌సభ బరిలో నిలిచేందుకు తమకు అవకాశం కల్పించాలని దరఖాస్తులు అందజేశారు. నియోజకవర్గాల వారిగా.. మహబూబాబాద్ 9, నాగర్‌కర్నూల్ 8, వరంగల్ 6, భువనగిరి 6, ఖమ్మం 2, నిజామాబాద్ 3 చొప్పున దరఖాస్తులు అందినట్టు గాంధీభవన్ వర్గాలు పేర్కొన్నాయి.

బడ్జెట్‌లో అందమైన అబద్ధాలు చెప్పారు

▸ సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

హైదరాబాద్, ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మధ్యంతర బడ్జెట్‌లో అందమైన భాషతో అందమైన అబద్ధాలు చెప్పారని సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ విమర్శించారు. బడ్జెట్‌లో ఉద్యోగాల ఊసే లేదని, కార్పొరేట్ రంగానికి పెద్దపీట వేశారన్నారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు మొండిచేయి చూపారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు విమర్శించారు. బయ్యారం ఉక్కు పరిశ్రమ ఊసే లేదని, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు నిధులు ప్రకటించలేదన్నారు. విద్యా రంగానికి 10శాతం నిధులు కేటాయించాల్సి ఉన్నా విస్మరించారని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ అన్నారు. వ్యవసాయాన్ని కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేసేలా బడ్జెట్ ఉందని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ విమర్శించారు.

ఇది భ్రమల బడ్జెట్: తమ్మినేని

కేంద్ర బడ్జెట్‌ను కార్పొరేట్లకు లాభాలు కట్టబెట్టే, ప్రజలను భ్రమల్లో పెట్టే బడ్జెట్ అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం విమర్శించారు. లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రకటించిన బడ్జెట్ ఇది అని పేర్కొన్నారు.

జనాభా వృద్ధి రేటు సవాళ్లపై కమిటీ

▸ ఉన్నతాధికారులతో ఏర్పాటు చేయనున్న కేంద్రం
▸ సంతానోత్పత్తి రేటు తగ్గుతోందంటూ నివేదికలు
▸ తగినంతగా రీ ప్లేస్‌మెంట్ లేదనే ఆందోళనలు..

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: దేశంలో జనాభా వృద్ధి రేటులో ఎదురవుతున్న సవాళ్లపై ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మల తెలిపారు. సంతానోత్పత్తి రేటు భర్తీ స్థాయుల (రీప్లేస్‌మెంట్ రేట్) కంటే పడిపోయినట్లు గణాంకాలు సూచిస్తుండడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. దేశంలో 2011లో చివరిసారిగా జనాభా లెక్కల సేకరణ చేపట్టారు. 2021లో మళ్లీ గణన నిర్వహించాల్సి ఉన్నప్పటికీ కొవిడ్ నేపథ్యంలో వాయిదా వేశారు. ఈ క్రమంలో జనాభాపై సాధికార లెక్కలు లేవు. వృద్ధి రేటు 2.1 నుంచి 2కి తగ్గిందంటూ 2020 నాటి శాంపిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ (ఎస్ఆర్ఎస్), 2.2 నుంచి 2కు పడిపోయిందంటూ నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే (ఎన్ఎఫ్‌హెచ్ఎస్) పేర్కొన్నాయి. దీనికి పరిష్కార మార్గాలను కమిటీ సూచించనుంది. జనాభా వేగవంతమైన వృద్ధి, మార్పుల నుంచి ఉత్పన్నమయ్యే సవాళ్లను పరిశీలించనుంది.

గోదావరి ఎక్స్‌ప్రెస్‌కు యాభై ఏళ్లు

▸ భాగ్యనగరం నుంచి వాల్తేరుకు మొదటి రైలు ఇదే
▸ 1974 ఫిబ్రవరి 1న ప్రారంభమైన ఎక్స్‌ప్రెస్



సికింద్రాబాద్/హైదరాబాద్ సిటీ, విశాఖపట్నం, రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): గోదావరి ఎక్స్‌ప్రెస్.. ఏపీలోని ఉభయ గోదావరి జిల్లాలతోపాటు ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన రైలు ప్రయాణికులకు అత్యంత ప్రతిష్ఠాత్మకమైన రైలు. గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో బెర్తు దొరికిందంటే.. బంగారం బిస్కెట్ దొరికినంతగా విశాఖ ప్రాంతవాసులు ఆనందపడతారంటే అతిశయోక్తికాదు. 1974 ఫిబ్రవరి 1న హైదరాబాద్-విశాఖపట్నం మధ్య ప్రారంభమైన మొట్టమొదటి రైలు ఇది. అంటే ఈ రైలు ప్రవేశపెట్టి గురువారానికి సరిగ్గా యాభై ఏళ్లు పూర్తయ్యాయి. గోదావరి ఎక్స్‌ప్రెస్ రైలు ప్రస్తుతం హైదరాబాద్(నాంపల్లి) స్టేషన్ నుంచి సాయంత్రం 5.05గంటలకు బయల్దేరి సికింద్రాబాద్, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, అనకాపల్లి మీదుగా.. విశాఖపట్నానికి చేరుకుంటుంది. ఉమ్మడి అంధ్రప్రదేశ్‌లో ఉద్దండులైన ప్రజాప్రతినిధులకు, ఉన్నతాధికారులకు ఇది ఎంతో ముఖ్యమైన రైలుగా ఉండేది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు రావాలన్నా, ఇక్కడ్నుంచి స్వస్థలాలకు వెళ్లాలన్నా ఈ రైలులో వెళ్లడాన్ని సౌకర్యవంతంగా భావిస్తారు. రాష్ట్రం విడిపోయిన తర్వాత ప్రజాప్రతినిధులు, అధికారుల తాకిడి కొంత తగ్గినా.. సాధారణ ప్రయాణికుల నుంచి ఆదరణ ఏమాత్రం తగ్గలేదు. దక్షిణ మధ్యరైల్వే ఆధ్వర్యంలో నడుస్తున్న గోదావరి ఎక్స్‌ప్రెస్ రైలు మొత్తం 18స్టేషన్లలో ఆగుతుంది. 24 బోగీలతో అతిపొడవైన రైలుగా పేరుగాంచిన ఈ ఎక్స్‌ప్రెస్ 710 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుంది. గురువారం సాయంత్రం గోదావరి ఎక్స్‌ప్రెస్‌కు రైల్ ఫ్యాన్స్ అసోసియేషన్ ప్రతినిధులు నాంపల్లి స్టేషన్‌లో ఘనంగా పుట్టిన రోజు వేడుకలు నిర్వహించడం విశేషం. దక్షిణ మధ్య రైల్వే కూడా ఈ ఎక్స్‌ప్రెస్‌ను సర్వాంగ సుందరంగా అలంకరించింది. ఈ రైలు ఆగే అన్ని స్టేషన్లలో వేడుకలు జరిపారు. 1990లోనే 24 కోచ్‌లతో అతి పెద్ద రైలుగా పేరొందిన గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో 2000 సంవత్సరం నుంచి ఫస్ట్‌క్లాస్ ఏసీ సేవలు అందుబాటులోకి వచ్చాయి. 1993 నుంచే థర్డ్ ఏసీ కోచ్‌లున్న ఈ రైలు.. దక్షిణ మధ్య రైల్వేలోనే మొదటి ఏసీ కోచ్ ఉన్న ఎక్స్‌ప్రెస్‌గా పేరుగాంచింది. ఈ ఎక్స్‌ప్రెస్‌ను నేరుగా దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ పర్యవేక్షిస్తారంటే దానికి ఉన్న ప్రాముఖ్యత చెప్పనక్కర్లేదు. రైలు నిర్వహణ నుంచి సమయపాలన, పరిశుభ్రత, ఆహార నాణ్యత, ఫిర్యాదులు, ఇతర ఆపరేషన్స్ అన్నీ ప్రతిరోజూ జీఎం టేబుల్ మీద ఉండాల్సిందేనని చెబుతుంటారు.

74 టీఎంసీలు కేటాయించాలి!

గోదావరి-కావేరి అనుసంధానంపై కేంద్రాన్ని డిమాండ్ చేసిన తెలంగాణ

హైదరాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): గోదావరి-కావేరి అనుసంధానంలో తరలించే 148 టీఎంసీల జలాల్లో 74 టీఎంసీలను తమకు కేటాయించాలని తెలంగాణ కోరింది. నదుల అనుసంధానంలో తెలంగాణకు 45 టీఎంసీలు కేటాయించాలని ప్రతిపాదించారని, అవి సరిపోవని తెలిపింది. పూర్వ నల్లగొండ, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో పలు ప్రాంతాలకు సాగునీటిని అందించాల్సి ఉన్నందున, 74 టీఎంసీలు ఇవ్వాలని విజ్ఞప్తి చేసింది. గోదావరి-కావేరి అనుసంధానంపైతెలంగాణ లేవనెత్తిన అంశాలపై చర్చించడానికి వీలుగా గురువారం జలసౌధలో జాతీయ నీటి అభివృద్ధి సంస్థ (ఎన్‌డబ్ల్యూడీఏ) హైదరాబాద్ విభాగం చీఫ్ ఇంజనీర్ దేవేందర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. దీనికి తెలంగాణ నుంచి ఈఎన్‌సీ బి.నాగేంద్రరావు, అంతరాష్ట్ర విభాగం చీఫ్ ఇంజనీర్ మోహన్‌కుమార్ తదితరులు హాజరయ్యారు. గోదావరి-కావేరి అనుసంధానంతో వివిధ అంశాలపై రాష్ట్ర అధికారులు తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు. కాగా తెలంగాణ అభ్యంతరాలపై మళ్లీ సమావేశం ఉంటుందని ఎన్‌డబ్ల్యూడీఏ స్పష్టం చేసింది. అనుమానాలన్నీ నివృత్తి చేశాకే నదుల అనుసంధానంలో ముందుకెళతామని తెలిపింది.

నేటి నుంచి పంచాయతీల్లో 'ప్రత్యేక' పాలన

హైదరాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): గ్రామ సర్పంచుల పదవీకాలం ముగిసిన నేపథ్యంలో శుక్రవారం నుంచి పంచాయతీలకు ప్రత్యేక అధికారులు బాధ్యత వహించనున్నారు. ఈ మేరకు గ్రామ ప్రత్యేకాధికారుల నియామకం, బాధ్యతల స్వీకరణ, విధి విధానాలను సూచిస్తూ.. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా ఉత్తర్వులు జారీ చేశారు. ఎంపీడీఓ, తహశీల్దారు, ఎంపీఓ, డీటీ, ఆర్ఐ, ఇంజినీర్లు, ఎంఈవోలు, ఇతర గెజిటెడ్ స్థాయి అధికారులను గ్రామ ప్రత్యేక అధికారులుగా నియమించారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా లేకపోవడంతో పదేళ్ల తర్వాత మళ్లీ గ్రామాల్లో ప్రత్యేక పాలన ప్రారంభం కానుంది. రాష్ట్రంలోని 12,769 గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించడంతో గురువారం సర్పంచుల వద్ద ఉన్న డిజిటల్ కీలు, చెక్కులు, ఇతర రికార్డులన్నీ సీజ్ చేయాలని గ్రామ పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశారు.

నేడు ఈజీఎస్ ఉద్యోగులకు పే స్కేల్ ప్రకటన..?

హైదరాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): 'గత ప్రభుత్వం పే స్కేల్ ప్రకటిస్తామని హామీ ఇచ్చింది.. అది అమలుకు నోచుకోలేదు.. కొత్త ప్రభుత్వం మా ఆశలు నెరవేరుస్తుందని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న ఉద్యోగులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. తమకు ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి నేడు(శుక్రవారం) ఇంద్రవెల్లి సభలో తమ పే స్కేల్ ప్రకటిస్తారని, సంబురాలు జరుపుకొనేందుకు ముందస్తు ఏర్పాట్లు చేసుకున్నామని ఈజీఎస్ ఉద్యోగులు ఒక ప్రకటనలో తెలిపారు.

కోర్టు ఆదేశాలిచ్చిన గంటల్లోనే జ్ఞానవాపీ సెల్లార్‌లో పూజలు

▸ హైకోర్టులో అప్పీలు చేసిన మసీదు కమిటీ

వారాణసి, ఫిబ్రవరి 1: జ్ఞానవాపీ మసీదు సెల్లార్‌లోని 'వ్యాస్ కీ టెఖానా'లో ఉన్న హిందూ దేవత విగ్రహాలకు పూజలు చేసుకోవచ్చంటూ జిల్లా కోర్టు ఆదేశాలు ఇచ్చిన కొద్ది గంటల్లోనే అక్కడ ప్రార్థనలు ప్రారంభమయ్యాయి. బుధవారం రాత్రి 10.30 గంటల సమయంలో పూజలు చేసి లక్ష్మీదేవి, వినాయకులకు హారతి ఇచ్చారు. 31 సంవత్సరాల అనంతరం వ్యాస్‌జీ కా టెఖానాను పూజల కోసం తెరిచారని కాశీ విశ్వనాథ మందిర ట్రస్టు అధ్యక్షుడు నాగేంద్ర పాండే తెలిపారు. కాగా, తమకు అప్పీలు వంటి న్యాయ ప్రక్రియకు కూడా అవకాశం ఇవ్వకుండా హిందువులు పూజలు చేసుకోవడానికి అనుమతి ఇవ్వడం తగదని పేర్కొంటూ మసీదు కమిటీ గురువారం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అయితే తొలుత హైకోర్టులో పిటిషన్ వేయాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ చెప్పడంతో దాన్ని అమలు చేసింది. అలహాబాద్ హైకోర్టులో పిటిషన్ సమర్పించి అత్యవసరంగా విచారణ జరపాలని కోరింది.

హేమంత్ సోరెన్‌కు ఒక రోజు కస్టడీ

▸ 10 రోజుల పాటు ఇవ్వాలన్న ఈడీ వినతిపై నేడు తీర్పు
▸ రాంచీలో 8.5 ఎకరాలు ఆక్రమించినట్టు కేసు నమోదు

రాంచీ, ఫిబ్రవరి 1: మనీలాండరింగ్ కేసులో అరెస్టయిన ఝార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌ను గురువారం ఇక్కడి పీఎంఎల్ఏ ప్రత్యేక కోర్టు ఒక రోజు జ్యుడీషియల్ కస్టడీకి పంపించింది. పోలీసులు ఆయనను ఇక్కడి బీర్సా ముండా సెంట్రల్ జైలుకు తరలించారు. ఆయనను పది రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలన్న వినతిపై కోర్టు శుక్రవారం తీర్పు వెలువరించనుంది. ఈడీ బుధవారం ఆయనను ఏడు గంటల పాటు విచారించింది. అనంతరం ఆయన ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయగా రాత్రి పది గంటల సమయంలో గవర్నర్ హౌస్ వద్ద అరెస్టు చేసింది. కాగా, రాత్రి సమయంలో గవర్నర్ హౌస్ ఆవరణలోనే అరెస్టు చేయడాన్ని సవాలు చేస్తూ గురువారం సోరెన్ లాయర్లు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. విచారణ సమయంలో ఆయన ధరించిన మతమపరమైన లాకెట్, రింగ్‌లను తీసివేయాలని ఈడీ అధికారులు కోరగా అందుకు ఆయన నిరాకరించారు. రాంచీలో సోరెన్ 12 చోట్ల 8.5 ఎకరాల విస్తీర్ణంగల స్థలాలను అక్రమంగా కలిగి ఉన్నారంటూ ఈడీ కేసుపెట్టింది. ఈ వ్యవహారంలో నగదు అక్రమ నగదు చలామణి జరిగినట్టు ఆరోపించింది. తొలుత భూమి రికార్డుల నకిలీ పత్రాలను తయారు చేస్తున్నారంటూ రెవెన్యూ శాఖ సబ్ ఇన్‌స్పెక్టర్ భాను ప్రతాప్ ప్రసాద్‌పై కేసు నమోదయింది. ఆయన వద్ద 11 ట్రంకు పెట్టెల్లో ఒరిజినల్, నకిలీ దస్తావేజులు, 17 ఒరిజినల్ రిజిస్టర్లు లభించాయి. దీనిపై జరిగిన విచారణలో ఇందులో సోరెన్‌కు సంబంధం ఉందంటూ ప్రసాద్ ఫోన్‌లో లభించిన సమాచారం ఆధారంగా ఈడీ కేసు నమోదు చేసింది. వాంగ్మూలం నమోదు చేయడానికని పిలిచి ఎలా అరెస్టు చేస్తారని సోరెన్ తరఫున హాజరైన అడ్వకేట్ జనరల్ రాజీవ్ రంజన్ ప్రశ్నించారు. ఇది ప్రభుత్వాన్ని కూలగొట్టడానికి జరిగిన కుట్ర అని ఆరోపించారు.



జేఎంఎం కూటమి ఎమ్మెల్యేలను తరలించడానికి బేగంపేట విమానాశ్రయం వద్ద సిద్ధంగా ఉన్న బస్సులు

ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయండి

(మొదటి పేజీ తరువాయి)

చంపయి సోరెన్ గవర్నర్ రాధాకృష్ణన్‌ను కలిశారు. హేమంత్ సోరెన్ రాజీనామా చేసిన అనంతరం రాష్ట్రానికి కొత్త సీఎం లేకపోవడంతో గందరగోళ పరిస్థితులు నెలకొని ఉన్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి లేకపోవడంతో రాజకీయ సంక్షోభం ముదిరిపోయే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామన్న తమ విజ్ఞప్తిని అంగీకరించాలని కోరారు. కాగా, చంపయి సోరెన్‌ను ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించడంలో గవర్నర్ ఆలస్యం చేయడంతో.. జేఎంఎం-కాంగ్రెస్ కూటమి ఎమ్మెల్యేలను హైదరాబాద్ తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. గురువారం రెండు చార్టర్డ్ విమానాలను సిద్ధం చేయగా.. సాయంత్రం 6.30 గంటల సమయంలో పొగమంచు ఎక్కువగా ఉండడంతో వాటిని రద్దు చేశారు. 81 మంది సభ్యులున్న ఝార్ఖండ్ అసెంబ్లీలో జేఎంఎం కూటమికి 43 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. ఇక మనీలాండరింగ్ కేసులో ఈడీ తనను అరెస్టు చేయడాన్ని సవాలు చేస్తూ మాజీ సీఎం హేమంత్ సోరెన్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆయన పిటిషన్‌ను విచారించేందుకు సీజేఐ ముగ్గురు న్యాయమూర్తులతో ప్రత్యేక ధర్మాసనాన్ని ఏర్పాటు చేశారు. సోరెన్ పిటిషన్‌పై శుక్రవారం విచారణ జరపనున్నారు.

ఆర్మూర్‌లో రోడ్డు భద్రత మాసోత్సవాలు


రోడ్డు భద్రత మాసోత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంవీఐ

ఆర్మూర్‌రూరల్, ఫిబ్రవరి1: ఆర్మూర్ పట్టణంలో రవాణా శాఖ ఆధ్వర్యంలో గురువారం రోడ్డు భద్రత మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవీఐ వెంకటస్వామి మాట్లాడుతూ వాహనాలు నడిపే ప్రతీఒక్కరు ప్రభుత్వ నియమ నిబంధనలు పాటించాలన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం, హీయర్‌ఫోన్స్ పెట్టుకొని వాహనాలు నడపం వల్ల ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉందన్నారు. ట్రాఫిక్‌రూల్స్‌పై ప్రతీఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచించారు. అజాగ్రత్తగా వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరిగి ఊహించని భారీ నష్టం సంభవిస్తే కుటుంబాలు చిన్నాభిన్నమవుతాయని ఎంవీఐ వెంకటస్వామి అన్నారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రత మాసోత్సవాల పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అబుల్‌హుస్సేన్, ఎంవీఐ కార్యాలయ సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.

ఘన్‌పూర్‌లో హైమాస్ట్ లైట్లు ప్రారంభం


ఘన్‌పూర్‌లో హైమాస్ట్ లైట్లను ప్రారంభిస్తున్న దృశ్యం

డిచ్‌పల్లి,ఫిబ్రవరి 1:మండలంలోని ఘన్‌పూర్ గ్రామంలో శివాలయం వద్ద గురువారం రాత్రి రూ.1.25లక్షలతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను ఎంపీటీసీ సభ్యురాలు కుర్రిసవిత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..హైమాస్ట్ లైట్లను ఉదయం సమయంలో నిలపుదల చేసి రాత్రి సమయంలో వెలిగించేలా చూడాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో వీడీసీ సభ్యులు లింబాద్రి, దేవేందర్, బాజేందర్, రాము, కృష్ణ తేజా, గణేశ్‌రెడ్డి, విజయ్‌కుమార్, ఆకుల గంగాధర్, సాయిలు, రమేశ్, రాజు, కాంగ్రెస్ నాయకులు షాదుల్ల పాల్గొన్నారు.


బీబీఏ, కళాశాలలకు ఏఐసీటీఈ అనుమతులు తప్పనిసరి

● ఆడిట్‌సెల్ డైరెక్టర్ ఘంట చంద్రశేఖర్


టీయూలో మాట్లాడుతున్న ఆడిట్‌సెల్ డైరెక్టర్ ఘంట చంద్రశేఖర్‌రావు

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 1: తెలంగాణ యూనివర్సిటీలో కళాశాలల ప్రధానచార్యులతో బుధ వారం అకాడమిక్ ఆడిట్‌సెల్ డైరెక్టర్ ప్రొ.ఘంట చంద్రశేఖర్ సమావేశమయ్యారు. ఈసందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ..తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని కొత్తగా ఏర్పాటు అయిన ఎంబీఏ,ఎంసీఏ, బీబీఏ, బీసీఏ, కళాశాలలకు 2024-25 అకడామిక్ ఇయర్ ఏఐసీటీఈ అనుమతులు తప్పనిసరి అని సూచించారు. ఈమేరకు అన్ని కళాశాలలు తప్పనిసరి అనుమతులు పొందాలని సూచించారు. పాతకొత్త కళాశాలలకు ఏఐసీటీఈ గడువు ఫిబ్రవరి7 వరకు పొడిగించిన నేపథ్యంలో అన్నికళాశాలలు నిర్ణీత గడువులోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అనుమతులు లేని కళాశాలలకు వచ్చే ఏడాది గుర్తింపు ఇచ్చే పరిస్థితి లేదన్నారు. ఆన్‌లైన్ అఫ్లికేషన్ పూర్తి చేయడంలో ఎదురయ్యే సాంకేతిక సమస్యలను తొలగించి వర్సిటీ సహకరించాలని కోరారు. రిజిస్ట్రార్ యాదగిరితో చర్చించి నిపుణులతో వర్క్‌షాపుఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో అకాడమిక్ ఆడిట్ సెల్ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

పొతంగల్‌లో ఇసుక ట్రాక్టర్ల పట్టివేత


ఇసుక ట్రాక్టర్లు పోలీస్ స్టేషన్‌కు తరలించిన దృశ్యం

కోటగిరి,ఫిబ్రవరి1: పొతంగల్ మంజీర నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లతో సహ మరో వాహనాన్ని పట్టుకున్నట్లు ఎస్‌ఐ సందీప్ తెలిపారు. ఇసుక రవాణాకు వే బిల్లు తప్పనిసరి తీసుకోవాలని సూచించారు. నిర్ణీత సమయంలోపే ఇసుక రవాణా చేయాలని, లేనిపక్షంలో తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పేర్కొన్నారు.

'పది' పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం పెరగాలి

● జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గా ప్రసాద్


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖ అధికారి

బోధన్ రూరల్, ఫిబ్రవరి1: ప్రభుత్వ పాఠశాలల్లోని పదోతరగతి విద్యార్థుల పరీక్ష ఫలితాల్లో ఉత్తీర్ణత శాతం పెరగాలని జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్ అన్నారు. గురువారం బోధన్‌పట్టణంలో డివిజన్ స్థాయి ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల్లో ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెరగాలన్నారు. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహించి ఆయా సబ్జెక్టులలో వెనుకబడి ఉన్న విద్యార్థులను గుర్తించి ఉత్తీర్ణులు అయ్యేలా ప్రత్యేక తరగతులను ఏర్పాటు చేయాలన్నారు. ఈ సంవత్సరం పదో తరగతి విద్యార్థులకు ఏడు పరీక్ష పత్రాలుప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు. పదోతరగతి పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈకార్యక్రమంలో బోధన్ మండల విద్యాశాఖ అధికారి నాగ్‌నాథ్, శాంతాకుమారిలతో మండల స్థాయి విద్యాశాఖ అధికారులు, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్తు

● బోధన్ ఆర్డీవో రాజాగౌడ్


పొతంగల్‌లో విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ఆర్డీవో

కోటగిరి,ఫిబ్రవరి1: తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చేందుకు విద్యార్థులు కష్టపడి చదవడంతో పాటు ఇష్టపడి చదవడం వల్ల ఉజ్వల భవిష్యత్తు ఉంటోందని బోధన్ ఆర్డీవో రాజాగౌడ్ పేర్కొన్నారు. పొతంగల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలను గురువారం ఆర్డీవో సందర్శించారు. 10వ తరగతి విద్యార్థులతో సమావేశమయ్యారు. జీవితంలో ఉన్నత లక్ష్యాలు నిర్ధేశించుకుని సాధించిన మహోన్నతుల విజయగాథాలను విద్యార్థులకు వివరించారు. చదువుపట్ల నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తు అంధకారం అవుతోందన్నారు. కనీస వసతులు లేని సమయంలో ఎంతోమంది వ్యక్తులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకున్నారని గుర్తు చేశారు. ప్రస్తుతం ప్రభుత్వ విద్యార్థులకు ఎన్నో రకాల వసతులను కల్పిస్తోందని ఆయన పేర్కొన్నారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. పదోతరగతి పరీక్షలలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని తద్వారా పాఠశాలతో సహ తల్లిదండ్రులకు పేరుప్రఖ్యాతలు తీసుకురావాలని సూచించారు. అనంతరం పొతంగల్, కోటగిరి తహసీల్దార్ కార్యాలయాలను తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్‌లు రమేష్, ప్రభాకర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాయిలు, ఉపాధ్యాయులు వెంకటేశ్వరరెడ్డి, నిర్మల, మాణిక్యం, హన్మాండ్లు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు చెక్కుల అందజేత


చెక్కులు అందజేస్తున్న ఎఫ్‌ఆర్‌వో రవిమోహన్‌భట్

ఇందలవాయి,ఫిబ్రవరి 1: మండలంలోని వివిధ గ్రామాల్లో పెంపుడు జంతువులపై అడవి మృగాలు దాడి చేసి గతంలో చంపివేయడంతో ఆయా యజమానులకు గురువారం ఇందల్‌వాయి అటవీ శాఖ అధికారి రవిమోహన్‌భట్ నష్టపరిహారం కింద మంజూరు అయిన చెక్కులను అందజేశారు. మేగ్యానాయక్‌తండాకు చెందిన సక్కుబాయికి చెందిన ఆవు చిరుతపులి దాడిలో చనిపోవడంతో ఆమెకు రూ.40వేల చెక్కు, చంద్రాయన్‌పల్లి గ్రామానికి చెందిన పుర్రె సాయిలు గొర్రెల మందపై చిరుత దాడిలో గొర్రె మృతి చెందడంతో అతనికి రూ.7500ల చెక్కు, ధర్మారం గ్రామానికి చెందిన నాగేశ్వర్ రావ్ ఆవు దూడను చిరుత చంపివేయడంతో అతనికి రూ.30వేల చెక్కును, రాంసాగర్‌తండాకు చెందిన సుధాకర్ గేదేదూడ చిరుతదాడిలో చనిపోవడంతో అతనికి రూ.20వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా రవిమోహన్‌భట్ మాట్లాడుతూ పెంపుడు జంతువులను అడవి జంతువులు దాడి చేసి చంపినట్లయితే అడవి జంతువులపై విష ప్రయోగం కాని, వాటిని వేటాడి చంపడం కాని చేయకుండా సంబంధిత అటవీశాఖాధికారులకు సమాచారం అందించనట్టయితే అడవి మృగాల దాడిలో చనిపోయిన పెంపుడు జంతువులకు అటవీ శాఖతో నష్టపరిహారం అందేలా చూస్తామని అన్నారు. ఎవరు కూడ అటవీ జంతువులపై దాడులు చేయొద్దని సూచించారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ ఎఫ్‌ఆర్‌వో శ్రీనివాస్, ఎఫ్‌ఎస్‌వో ఆనంద్, బాబురావ్, బీట్ ఆఫీసర్ రాకేష్, అర్చన, పవన్, సాయిదీప్తి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కరెంట్ షార్ట్ సర్క్యూట్‌తో గోదాం దగ్ధం


పొగతో కమ్ముకుపోయిన భవనం, గుమిగూడిన జనం

బోధన్‌రూరల్,ఫిబ్రవరి1:బోధన్ పట్టణంలోని అనిల్‌టాకీస్ చౌరస్తాలో గురువారం రాత్రి అపార్టుమెంట్‌లో ఉన్న గోదాంలో షార్ట్‌సర్క్యూట్‌తో చోటు చేసుకుంది. దీంతో పొగతో బిల్డింగ్ అంతా కమ్ముకుపోయింది. గమనించిన స్థానికులు బిల్డింగ్ యజమానికి, పోలీసులకు,అగ్నిమాపకశాఖకు సమాచారం అందించారు.అప్రత్తమైనఅగ్నిమాపకశాఖ అధికారి అపార్టుమెంట్‌ల ఉండే కుటుంబాలను బయటకు పంపించారు. దీంతో ప్రాణపాయం తప్పి నట్లయింది. అగ్ని ప్రమాద ఘటనను గుర్తించి పూర్తిగా కరెంట్ సరఫరాను నిలిపివేశారు. అగ్ని మాపక సిబ్బంది మంటలను అర్పి ప్రమాద ఘటనను అదుపులోకి తీసుకు వచ్చారు. ఎంత వరకు నష్టం జరిగిందో త్వరలో వెల్లడిస్తామని అగ్నిమాపకశాఖ అధికారి గంగాదాస్ తెలిపారు.

నేడు విద్యుత్ అంతరాయం

సుభాష్‌నగర్,ఫిబ్రవరి 1:నాగారం సెక్షన్ పరిధిలోని 11 కేవీ రాజీవ్‌గృహకల్ప ఫీడర్‌లో లైన్‌ల మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటోందని ఏడీఈ వీరేశం తెలిపారు. నాగారం, రాజీవ్‌గృహకల్పనాగారం, పూజారికాలనీ, డంపింగ్‌యార్డ్, 80,300కోటర్స్‌డ్రైవర్స్‌కాలనీ,బీడీ వర్కర్స్‌కాలనీ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

ఆర్టీసీ బస్సులో చోరీ

బోధన్‌రూరల్,ఫిబ్రవరి1: బోధన్ నుంచి నిజామాద్ వెళుతున్న ఆర్టీసీబస్సులో గురువారం పోసాని అనే వృద్ధురాలి మెడలో నుంచి గుర్తు తెలియని దొంగలు రెండు తులాల బంగారు గుండ్ల గొలుసును దొంగిలించారు. బోధన్ నుంచి పోసాని అనే వృద్ధురాలు నిజామాబాద్ వెళ్లే బస్సు ఎక్కింది. తన మెడలో బంగారు గుండ్ల గొలుసు ఉందని, టికెట్‌కొరకు ఆధార్‌కార్డు తీసేటప్పుడు తనమెడలోని బంగారుగుండ్ల గొలుసు లేదని వాపోయింది. రెండు తు లాల మూడు గ్రాముల బంగారు గుండ్ల గొలుసు చోరీకి గురైందని బస్సులోని డ్రైవర్‌కు తెలపగా బస్సును ఎడపల్లి మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ వద్ద నిలిపి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు బస్సు లో ప్రయాణిస్తున్న ప్రయాణీకులను తనిఖీ చేశారు. బంగారం దొరకకపోవడంతో బోధన్ పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు.అనంతరం బంగారుగొలుసు గుండ్లు పోగొట్టుకున్న మహిళ బోధన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

కెప్టెన్ కరుణాకర్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

బోధన్ రూరల్, ఫిబ్రవరి 1: కాంగ్రెస్ పార్టీ ప్రచార రాష్ట్ర కమిటీ సభ్యులు కెప్టెన్ కరుణాకర్‌రెడ్డి కుటుంబాన్ని గురువారం బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి పరామర్శించారు. ఇటీవల కెప్టెన్ కరుణాకర్‌రెడ్డి తండ్రి భూమారెడ్డి మృతి చెందారు. కెప్టెన్ కరుణాకర్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి భూమారెడ్డి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు తాహెర్ బీన్ హందాన్ తదితరులు ఉన్నారు.

యువత నైపుణ్యం ప్రదర్శించాలి



టీయూలో యువజన ఉత్సవాల ముగింపు సమావేశంలో రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు

డిచ్‌పల్లి,ఫిబ్రవరి 1: నేతాజీ సుభాష్ చంద్రబోస్, స్వామి వివేకానందలను ఆదర్శంగా తీసుకొని యువత ఆదర్శంగా ముందుకు సాగాలని, గెలుపు ఓటములను అలవాటు చేసుకోవాలని ఓడినవారు కుంగిపోకుండా, యువత తమ నైపుణ్యతను చూపాలని ఏబీవీపీ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు రెంజర్ల నరేష్ అన్నారు. బుధవారం తెలంగాణ యూనివర్సిటీలో యువజన వారోత్సవాల ముగింపు సమావేశానికి రెంజర్ల నరేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహనీయుల ఆశయ సాధనకు యువత ముందుకు సాగాలని సుభాష్ చంద్రబోస్, స్వామి వివేకానందలను ఆదర్శంగా తీసుకొని దేశభక్తి కోసం పనిచేయలన్నారు. రాష్ట్ర ఏబీవీపీ కార్యదర్శి జాన్సీ మాట్లాడుతూ.. యువజన వారోత్సవాల సందర్భంగా యువతకు కబడ్డీక్రికెట్, వాలీబాల్, క్విజ్ పోటీలు, ఖోఖో, వ్యాసరచన పోటీలు నిర్వహించి గెలపొందిన వారికి బహుమతులు అందజేయడం ప్రశంసనీయమన్నారు. ఈకార్యక్రమంలో జాతీయకార్యవర్గ సభ్యుడు శివ, రాష్ట్ర కార్యదర్శి మనోజ్ కుమార్, ఇందూరు నగర అధ్యక్షుడు వెంకట కృష్ణ, ఏబీవీపీ నాయకులు నాగరాజు, సాయికృష్ణ, అనిల్, ప్రమోద్, విద్యార్థులు పాల్గొన్నారు.

కుళ్లిన కేక్‌ల విక్రయం

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి1: పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలోని బాలాజీ పెట్రోల్ బంక్ ఎదురుగా ఓబేకరీలో కుళ్లిన కేక్‌లను విక్రయించడంతో పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం పుట్టిన రోజు కోసం తీసుకువెళ్లిన కేక్‌ను తినడంతో కడుపులో వికరమైంది. ఈ విషయమై యాజమానికి చూపించడంతో నిర్లక్ష్యంగా వ్యవహరించారు. దీంతో ఫుడ్ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.తక్షణమే ఫుడ్ ఇన్‌స్పెక్టర్ చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

సంక్షిప్త సమాచారం

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన లలిత


సీఎంను కలిసిన లలిత

నిజామాబాద్‌అర్బన్,ఫిబ్రవరి1: మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత గురువారం సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు.నిజామాబాద్ పార్లమెంటు స్థానానికి తాను దరఖాస్తు చేసుకున్నానని తన అభ్యర్థిత్వాన్ని పరిగణలోకి తీసుకోవాలని ఆమె సీఎంను కోరారు.అంతకు ముందు గాంధీభవన్‌లో కాంగ్రెస్ పార్టీ తరపున నిజామాబాద్ పార్లమెంటు అభ్యర్థిగా తన పేరును పరిగణలోకి తీసుకోవాలని ఆమె దరఖాస్తు చేశారు. గాంధీభవన్ సిబ్బందికి తన దరఖాస్తు ఫారాన్ని అందజేశారు. పార్టీ నేతలు తన అభ్యర్థిత్వాన్ని పరిగణలోకి తీసుకోవాలని ఆమె కోరారు. ఆమె వెంట ఒలంపిక్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు గడీలరాములు, హైకోర్టు న్యాయవాది వెంకటేశ్వర్లు ఉన్నారు.

విద్యార్థులకు సమాచార హక్కు చట్టంపై అవగాహన

ఆర్మూర్‌రూరల్, ఫిబ్రవరి1: ఆర్మూర్ మండలం మగ్గిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు సమాచార హక్కుచట్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ జిల్లా అధ్యక్షుడు న్యాయవాది ఘట్టడి ఆనంద్ మాట్లాడుతూ చట్టాలపై ప్రతీఒక్కరు అవగాహన కలిగి ఉండాలని అన్నారు. పలుచట్టాలపై విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు ప్రశ్నించే తత్వాన్ని అలవార్చు కోవాలని అన్నారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు హరిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా ఒలంపిక్ అసోసియేట్ ఉపాధ్యక్షుడిగా సంజీవరెడ్డి

సుభాష్‌నగర్, ఫిబ్రవరి1: జిల్లా ఒలంపిక్ అసోసియేట్ ఉపాధ్యక్షుడిగా గాదారి సంజీవరెడ్డిని నామినేట్ చేసినట్లు జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈగ సంజీవ్ రెడ్డి తెలిపారు. ఒలంపిక్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశంలో గాదారి సంజీవ రెడ్డిని నామినేట్ చేసినట్లు తెలిపారు. సంజీవ రెడ్డిఎంపిక పట్ల జిల్లా సెపక్‌తక్రా అధ్యక్షుడు కేశవేణు, ఉపాధ్యక్షుడిగా గడ్డం సతీష్‌రెడ్డి, దీపిక, ల్యాబ్ గంగారెడ్డి, సంయుక్త కార్యదర్శులు గణేష్, మీసాల ప్రశాంత్, కార్యనిర్వాహణ కార్యదర్శి భాస్కర్‌రెడ్డిలు హర్షం వ్యక్తం చేశారు.

ప్రధాని మోదీకి క్షీరాభిషేకం

పెద్దబజార్, ఫిబ్రవరి 1:బిహార్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కర్పూరి ఠాకూర్‌కు భారతరత్న ప్రకటించిన ప్రధాని మోదీ చిత్రపటానికి బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి మాదాసు స్వామియాదవ్ క్షీరాభిషేకం చేశారు. గురువారం నగరంలోని నిఖిల్‌సాయి చౌరస్తా వద్ద క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిహార్ మాజీ ముఖ్యమంత్రి స్వతంత్ర్య సమరయోధుడు లోక్‌నాయక్ పేద వెనుకబడిన తరగతుల సంక్షేమ కోసం రైతుల హక్కుల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహానాయకుడు ఠాకూర్‌కు భారత రత్న అవార్డు అందజేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా అర్బన్ కన్వీనర్ గిరిబాబు, బీజేపీ నాయకులు నారాయణయాదవ్, మండల అధ్యక్ష,కార్యదర్శులు పాల్గొన్నారు.

మైనారిటీ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా అశ్వక్‌హైమద్

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి1: తెలంగాణ స్టేట్ మైనారిటీ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్ ఆర్మూర్ డివిజన్ అధ్యక్షుడిగా అశ్వక్‌హైమద్ ఎన్నికయ్యారు. గురువారం ఆర్మూర్‌లో టీఎస్‌మెసా (తెలంగాణ స్టేట్ మైనారిటీ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్) ఎన్నికలు నిర్వహించారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడిగా అస్లాంబీన్ మోహసీన్‌అధ్యక్షుడిగా మహమ్మద్ అశ్వక్ హైమద్,వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మహమ్మద్ సర్దార్ మోహీద్దీన్, అసోసియేట్ అధ్యక్షుడిగా మహమ్మద్ అబ్దుల్‌మాలిక్, ప్రధానకార్యదర్శి సయ్యాద్‌మాజీద్, అదనపు ప్రధానకార్యదర్శిగా మహమ్మద్ అబ్దుల్‌ఫహీం, కోశాధికారిగా మహమ్మద్ అబ్దుల్లా,ఉపాధ్యక్షుడిగా షేక్‌అరీఫ్,నిజాముద్దీన్,జాన్‌విల్సాన్,సయ్యద్ హైదర్,అబ్దుల్‌సలీం,సంయుక్త కార్యదర్శులుగా మహమ్మద్‌సైఫ్‌అలీబాబా, అబ్దుల్ ముజాహీద్, కార్యనిర్వహక కార్యదర్శిగా సయ్యద్ జామిల్,సుల్తాన్ మోహీనోద్దీన్,అబ్దుల్‌వహీద్, ప్రచారకార్యదర్శిగాషకీల్‌లను ఎన్నుకున్నారు.

4న ప్రతిభ కళాశాల ప్రవేశ పరీక్ష

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 1: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ప్రతిభ కళాశాలల్లో 2024-25 విద్యాసంవత్సరానికి ప్రథమ సంవత్సరం ఇంటర్మీడియేట్ ప్రవేశానికి సంబంధించిన ప్రవేశ పరీక్ష సీవోఈ సెట్ 2024 ఈ నెల 4న (ఆదివారం) ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు ప్రవేశ పరీక్ష ఎంపిక చేయబడిన కేంద్రాల్లో నిర్వహించడం జరుగుతుందని ప్రిన్సిపాల్ సంగీత ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్ జిల్లాలో ఈ పరీక్ష టీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్ ధర్మారం(బి), కంజర, ఆర్మూర్, సుద్దపల్లి, పోచంపాడ్, నవీపేట, కామారెడ్డి జిలాల్లో టీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్(జేసీ) ఎల్లారెడ్డి, బిక్కనూరు, దోమకొండ, తాడ్వాయి, తడ్కోల్, కోయగుట్ట, తక్కడపల్లి, పెద్ద కొడప్‌గల్, కామారెడ్డి డిగ్రీ కళాశాల,పెద్ద ఎక్లార, బాన్సువాడ (బోర్గాం), నిర్మల్ జిల్లాలో ముథోల్, లెఫ్ట్ పోచంపాడు, జామ్, కడెం, బైంస, ఈ పరీక్ష నిర్వహించడబడుతుందని ప్రాంతీయ సమన్వకర్త అలివేలు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు హల్ టికెట్‌లను అంతర్జాలం నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ప్రవేశ పరీక్ష సకాలంలో హాజరుకావాలని, గంట ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని ఆర్సీవో సూచించారు. పరీక్ష ప్యాడు, బ్లూ,అర్ బ్లాక్ పెన్, వెంట తెచ్చుకోవాలని సూచించారు.

నేడు బాల్కొండ సర్వసభ్య సమావేశం

ముప్కాల్, ఫిబ్రవరి1: బాల్కొండ మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 11గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో సంతోష్ తెలిపారు.ఎంపీపీ అధ్యక్షతన జరిగే సర్వసభ్య సమావేశానికి సకాలంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధశాఖల అధికారులు కావాలని ఆయన తెలిపారు.

చికెన్ ధరలు



రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.140	రూ.215	రూ. 240
వెన్‌కాబ్(కిలో)	రూ.145	రూ.220	రూ. 250

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.64,500	రూ.59,500	రూ.760

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : అంబాజీపేట మ్యారేజీబ్యాండ్ (12.20,6.50)
: ఫైటర్ (హిందీ 3డీ) (3.15,9.45)
స్క్రీన్-2 : ఫైటర్ (హిందీ 3డీ) (11.45)
: హనుమాన్ (తెలుగు) (3.20, 6.40, 10.00)
స్క్రీన్-3 :కిస్మత్ (10.40)
:అర్గిలీ(ఇంగ్లీష్)(1.30,7.35)
:గేమ్‌ఆన్(4.35)
:అంబాజీపేట మ్యారేజీబ్యాండ్ (10.40)
స్క్రీన్-4 : ధీర (10.25, 7.20)
: బూట్‌కట్‌బాలరాజు (1.05)
:హ్యాపీఎండింగ్ (4.10)
:కిస్మత్ (10.00)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : అంబాజీపేట మ్యారేజీబ్యాండ్ (10.30,1.30, 4.30, 7.30, 10.30)
స్క్రీన్-2 :కిస్మత్ (10.30) : గేమ్‌ఆన్(1.25)
:హ్యాపీఎండింగ్ (4.30): ధీర (7.20)
:బూట్‌కట్‌బాలరాజు (10.20)
స్క్రీన్-3: ధీర (10.40): హనుమాన్ (1.30,4.30,7.30,10.30)



దేవి : హనుమాన్ (11.15, 2.15, 6.15, 9.15)
లలితమహల్ : గుంటూరుకారం (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ :కిస్మత్ (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ :అంబాజీపేట మ్యారేజీబ్యాండ్ (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్